నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 21 ఫిబ్రవరి 2024 | NALGONDA

పాతగుట్టలో వైభవంగా ధ్వజారోహణం


పాతగుట్టలో దేవతాహ్వానం

యాదగిరిగట్ట, ఫిబ్రవరి 20 : యాదగిరి గుట్టలోని పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భేరి పూజ, గరుత్మంతుడితో దేవతాహ్వానం తంతును సంప్రదాయబద్ధంగా జరిపారు. బుధవారం నరసింహ స్వామి పెళ్లికొడుకుగా ముస్తాబవనున్నారు. ఈ సందర్భంగా ఎదుర్కోలు ఉత్సవం, వివాహ నిశ్చయ కార్యక్రమం చేపట్టనున్నారు.

ఆస్మిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కాల్వ కింద కన్నీటి వెతలు

సాగర్ ఎడమ కాల్వ కింద నీళ్లు లేక ఎండుతున్న పంటలు

- అడుగంటిన భూగర్భజలం, కరెంట్ కోతలతో అన్నదాత అవస్థలు
- మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు
- యాసంగి పంటలు చేతికొచ్చేది కష్టమేనని రైతుల ఆందోళన
- నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలని వేడుకోలు

నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా గడ్డు పరిస్థితులను ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. నీళ్లు లేక, సరిపడా కరెంట్ రాక పంటలు ఎండిపోతుండడంతో తల్లడిల్లిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది ఎగువ నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి వరద నీరు రాలేదు. దాంతో గత వానకాలంతోపాటు ప్రస్తుత యాసంగిలో కూడా ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయలేదు. 1999-2004 మధ్య నాటి దుర్భర పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. నాడు ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు హయాంలో సేద్యం చేద్దామంటే కాల్వ కింద సాగు నీరు వచ్చేది కాదు. బోర్ల కిందనైనా తిండి గింజలనైనా పండించుకుందామంటే కరెంట్ ఉండేది కాదు. సాగర్ ఆయకట్టు రైతులు ఇప్పుడు అలాంటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

– హాలియా, ఫిబ్రవరి 20

అనుముల మండలం రామడుగు గ్రామంలో ఎండిన వరిపొలం

అనుముల మండలం హజారిగూడెంలో నెర్రెలు బారిన వరి పొలం

సాగర్ ఎడమ కాల్వ కింద యాసంగిలో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతేడాది యాసంగిలో లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తే ఈ ఏడాది 30 శాతానికి మించలేదు. బోరు బావుల కింద మాత్రమే రైతులు వరి వేశారు. కానీ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లు వట్టిపోతున్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తామన్న 24గంటల కరెంట్ సక్రమంగా ఇవ్వకపోవడంతో బోరు బావుల కింద వరి పొలాలు ఎండిపోతున్నాయి. దాంతో వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను ముట్టడించడంతో రహదారులపై ధర్నాలు, రాస్తారోకో చేస్తున్నారు.

ఎడమ కాల్వ నీటితో చెరువులు నింపని ప్రభుత్వం

ఖమ్మం జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాల కోసమంటూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల మొదటి వారంలో 6 రోజుల పాటు నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేసింది. కానీ నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఒక్క చెరువును కూడా ఎడమ కాల్వ నీటితో నింపలేదు. దాంతో సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మూగజీవాలకు సైతం నీళ్లు దొరకని పరిస్థితి నెలకొన్నది.

25శాతం పొలాలు ఎండిపోయే పరిస్థితులు

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో గతేడాది యాసంగిలో 1,26,489 ఎకరాల్లో వరి సాగు చేయగా ఈ సంవత్సరం యాసంగికి 76,323 ఎకరాలకు పడిపోయింది. కాల్వకు నీళ్లు రాకపోవడం, భూగర్భ జలాలు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఎండతీవ్రతకు చేతికి వచ్చే పంట కూడా దక్కే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరోసారి ఎడమ కాల్వ పరిధిలోని మేజర్లకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

ఎడమ కాల్వకు నీళ్లివ్వాలి

ఈ ఏడాది సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడం వల్ల ఆయకట్టు బీడుబారింది. ఎండ తీవ్రతకు మడికట్లలో గడ్డిపోస కూడా లేదు. మూగజీవాలను మేపేందుకు గడ్డి, తాగేందుకు నీరు దొరకడం లేదు. ప్రభుత్వం ఎడమ కాల్వ నీటితో చెరువులను నింపితే రైతులతో మూగజీవాలకు మేలు జరుగుతుంది.

– పిల్లి సైదులు, ఇబ్రహీంపేట, అనుముల మండలం

కరెంట్ సక్రమంగా లేక పొలం ఎండిపోతున్నది

నేను బోరు కింద మూడు ఎకరాల్లో వరిసాగు చేసిన. వ్యవసాయానికి ప్రభుత్వం 16 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదు. ఎండ తీవ్రతకు నీళ్లు అందక పొలం ఎండిపోతున్నది. వేలకు వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే కరెంట్ కోతల కారణంగా పంట చేతికి వస్తుందన్న నమ్మకం లేదు.

–నగిరి శ్రీనివాస్, రైతు, త్రిపురారం

గురుకులాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

- విద్యార్థినుల ఆత్మహత్యలు బాధాకరం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఆస్మిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మోతె, ఫిబ్రవరి 20 : గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలు కలిచి వేస్తున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇమాంపేట గురుకుల విద్యార్థిని ఆస్మిత ఇటీవల ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె సొంతూరు మోతె మండలం బుర్కచర్లకు మంగళవారం కవిత వెళ్లారు. ఆస్మిత తల్లిని, కుటుంబ సభ్యులను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే గురుకుల పాఠశాల పనితీరుపై సమీక్షించి ఆడబిడ్డల ప్రాణాలను కాపాడాలన్నారు. 10రోజుల్లో ఇమాంపేటలోని పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. రెండు వారాల క్రితం భువనగిరి గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల ఒత్తిడితో ఉన్నారా అన్నది ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు.

గురకులాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది పిల్లలను చదివిస్తున్న నేపథ్యంలో ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతుంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఆడ పిల్లలు సున్నితంగా ఉంటారు కాబట్టి ఆత్మహత్య చేసుకునేంత స్థాయికి ఎందుకు ఒత్తిడి చేస్తున్నారని, సమయానికి సిలబస్ పూర్తి, నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని కోరారు. ప్రస్తుతం విద్యా శాఖకు పూర్తి స్థాయి మంత్రి లేరని, దీనిపై సీఎం చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫ్రెండ్లీనేచర్ కల్పించాలని, సైకాలజిస్ట్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలని సూచించారు. మృతి చెందిన విద్యార్థినుల కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆస్మిత తల్లి ఇరుగు జ్యోతికి కవిత ఆర్థిక సాయం అందజేశారు.

అనంతరం ఆస్మిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని సతీశ్, కొండా వెంకన్న, నూకల శ్రీనివాస్‌రెడ్డి, వాసంశెట్టి రమేశ్, భూక్య గాంధీ, బాణోతు వెంకన్న, దేవ్లానాయక్, లక్కపాక ప్రవీణ్‌కుమార్, సంజీవరెడ్డి, జాన్‌రెడ్డి, గుండాల గంగులు, శంకర్‌నాయక్, మహేందర్ ఉన్నారు.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య
- మృతిచెందిన విద్యార్థినుల కుటుంబాలకు న్యాయం చేస్తాం

ఇమాంపేట గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు

సూర్యాపేట రూరల్/బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 20 : విద్యార్థులు మనోధైర్యంతో ఉండాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం అవుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బిక్కి వెంకటయ్య అన్నారు. సూర్యాపేట మండల పరిధి ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలకు చావే కారణం కాకుడాదని, ఏమైనా ఉంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినుల ఆత్మహత్యల ఘటనలు పునరావృతం కాకుండా అన్ని సంక్షేమ పాఠశాలలో మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చనిపోయిన విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం అందేలా తమ కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు.

అనంతరం పాఠశాలలో తరగతి గదులు, భోజనశాలను, మరుగుదొడ్లను కమిటీ సభ్యులు పరిశీలించారు. వైష్ణవి, ఆస్మిత చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. వారి వెంట ఆర్డీఓ సీహెచ్.కృష్ణయ్య ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ ఏఈ

- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ అధికారులకు పట్టుబడిన మేళ్లచెర్వు పంచాయరాజ్ ఏఈ రంగరాజు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20 : పంచాయతీ రాజ్ ఏఈ రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ సంఘటన మంగళవారం హుజూర్‌నగర్‌లో జరిగింది. దీనికి సంబంధించి ఏసీబీ ఉమ్మడి నల్లగొండ డీఎస్పీ ఎంవీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు మండల పంచాయ రాజ్ ఏఈగా కోసూరి రంగరాజు పనిచేస్తున్నాడు. అదే మండలంలోని కప్పల కుండాతండాకు చెందిన ధారావత్ కృష్ణ కాంట్రాక్ట్ పనుల కింద పలు గ్రామాల్లో కరెంట్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేశాడు. దానికి సంబంధించిన ఎంబీలు చేసే విషయంలో రంగరాజు రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. దాంతో కృష్ణ ఈ నెల 30న అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల ప్రకారం మంగళవారం హుజూర్‌నగర్ పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయంలో కృష్ణ ఏఈ రంగరాజుకు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాడు. ప్రభుత్వం అధికారులు లంచగా అడిగితే 91543 88918 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని డీఎస్పీ ఎంవీ శ్రీనివాస్ రావు తెలిపారు.

పార్వతీ పరమేశ్వరుల అశ్వ వాహన సేవ

చెర్వుగట్టులో అశ్వవాహన సేవ

- వైభవంగా రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
- స్వామివారికి పుష్పోత్సవం, ఏకాంత సేవలు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులు అశ్వ వాహనంపై విహరించి భక్తులను కనువిందు చేశారు. ఈ సందర్భంగా మహా మండపం వద్ద 108 కలశాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. మన్యు సూక్తి హోమం, బలిహరణ, జయాధి హోమం, ధ్వజారోహణం, త్రిశూల స్నానం, వసంతోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవ మూర్తులకు చందనాభిషేకం, క్షేత్ర పాలక కాల భైరవుడికి అభిషేకాలు జరిపారు. స్వామివారికి వైభవంగా పుష్పోత్సవం, ఏకాంత సేవలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, దేవాదాయ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ నవీన్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

నేడు గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. చెర్వుగట్టు, ఎల్లారెడ్డి గూడెం గ్రామాల్లో పార్వతీ జడల రామలింగేశ్వర స్వామిని గజవాహనంపై ఊరేగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీ ఫ్లాప్ షో..

- తుస్సుమన్న విజయ సంకల్ప యాత్ర సభ
- ముఖ్య అతిథిగా గోవా సీఎం హాజరు
- కాలేజీ గ్రౌండ్ సభలో సగం కుర్చీలు ఖాళీ
- రెండు వేల మందితోనే మమ
- గోవా సీఎం మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన జనం
- చప్పగా సాగిన కమలం శ్రేణుల యాత్ర
- కాషాయ పార్టీలో ఎక్కడా కనిపించని జోష్

బీజేపీ సభలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎప్పటిలాగానే బీజేపీ సభ వెలవెలబోయింది. ఏదో వచ్చామా.. కనిపించామా.. వెళ్లిపోయామా.. అన్నట్టుగా నేతలు నామ్‌కే వాస్తేగా సభను కానిచ్చేశారు. గోవా ముఖ్యమంత్రి హాజరైన బహిరంగ సభలో కనీసం రెండు వేల మంది కూడా హాజరు కాలేదు. సగం కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఓవరాల్‌గా బీజేపీ సభ చప్పగా సాగింది.

రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయ సంకల్ప యాత్రలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భువనగిరికి సంబంధించి భాగ్యలక్ష్మి క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధితోపాటు మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను కవర్ చేస్తూ యాత్ర కొనసాగనున్నది. తొలి రోజు భువనగిరి పట్టణంలో యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో సభను ఏర్పాటు చేశారు. దీనికి గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తోపాటు రాష్ట్రంలోని పలువురు నేతలు హాజరయ్యారు. ఇంత వరకు బాగానే ఉన్నా సభ ప్లాఫ్ అయ్యింది.

రెండు వేల మంబితోనే సభ..

సాధారణంగా బహిరంగ సభ అంటేనే భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివస్తారు. అలాంటి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభ తుస్సుమన్నది. మైదానం 7ఎకరాలు ఉండగా, కేవలం ఎకరంలోపు స్థలంలోనే సభను నిర్వహించారు. అందులోనే కుర్చీలు ఏర్పాటు చేశారు. స్టేజీ ముందు వేసిన కుర్చీలు సగం కూడా నిండలేదు. సభకు వచ్చిన వారిలో సైతం సగం మంది మధ్యలోనే వెళ్లిపోయారు. గోవా సీఎం మాట్లాడే సమయంలో జనమే లేకపోవడం గమనార్హం.

పసలేని ప్రసంగాలు..

సభ ఆసాంతంలో ఒక్కసారి కూడా జోష్ కనిపించకపోవడం గమనార్హం. బీజేపీ శ్రేణులు, ప్రజల నుంచి కనీసం స్పందన లేదు. పైగా సభలో బీజేపీ నేతలు చేసిన ప్రసంగాలు చప్పగా సాగాయి. కొందరు నేతలు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను కాదని, ప్రతిపక్షంలో బీఆర్ఎస్‌ను తిట్టడం ఏంటనే చర్చ జరిగింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఆరు గ్యారెంటీల అమలు చేయకపోవడంపై కాంగ్రెస్ పార్టీని కనీసం కార్నర్ చేయలేదని పలువురు అనుకోవడం కనిపించింది. ఇక ఈటల రాజేందర్, బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు ప్రసంగించే సమయంలో త్వరగా ముగియాలని పదేపదే చెప్పడం కనిపించింది. ఈటల రాజేందర్ మాట్లాడుతున్నప్పుడు ఆపే ప్రయత్నం చేయగా.. 'టైం అయ్యిందా'' అని ఈటల ఒక రకమైన స్వరంతో అనడంతో అంతా సైలెంట్ అయ్యారు.

అంతా గందరగోళం..

బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభ ఆసాంతం గందరగోళంగా సాగింది. కొందరి నేతలను వేదికపైకి పిలువలేదని అలిగారు. వారిని మళ్లీ వేదికపైకి పిలువాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పుల బాషా పిలువలేదని అనడంతో, పిలిచామని మైక్‌లోనే ఓ నేత అనడం కనిపించింది. వేదికపై మహిళలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒక్క మహిళకు మాత్రమే వెనకాల రెండో లైన్ తర్వాత కూర్చోబెట్టారు. మరోవైపు బీజేపీ నేతలు గూడూరు నారాయణరెడ్డి, పీవీ శ్యామ్‌సుందర్ హాజరు కాలేదు.

పవర్‌ప్లాంట్‌కు ప్రజామోదం

- యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ
- ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలంగా వివిధ గ్రామాల ప్రజలు ఓకే
- పర్యావరణ సమతుల్యతను పాటిస్తాం : టీఎస్ జెన్‌కో డైరెక్టర్ అజయ్

ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

దామరచర్ల, ఫిబ్రవరి 20 : దామరచర్ల మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.34వేల కోట్లతో 4 వేల మెగావాట్ల యాదాద్రి అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పర్యావరణ అనుమతి కోసం మంగళవారం అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణకు పరిసర గ్రామస్తులు, నాయకులు పాల్గొని అనుకూలంగా ఆమోదం తెలిపారు. మండలంలో గత ప్రభుత్వం పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం జూన్ 29, 2017లో అన్ని రకాల అనుమతులు తీసుకున్నది. పనులు కూడా దాదాపు పూర్తికావస్తున్నాయి. రెండు యూనిట్లు అందుబాటులోకి రానున్న క్రమంలో విశాఖ, ముంబైకి చెందిన ఎన్జీఓలు పర్యావరణ అనుమతి రద్దు చేయాలని ఎన్జీటీలో కేసులు వేశారు. ఎన్జీటీ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కలెక్టర్ హరిచందన అధ్యక్షతన యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పవర్ ప్లాంట్ బాధిత గ్రామాలైన మండలంలోని తాళ్లవీరప్పగూడెం, వీర్లపాలెం, కల్లేపల్లి, శాంతినగర్, పుట్టలగడ్డ తండా, కపూర్‌తండాలతో పాటు మిర్యాలగూడ పట్టణం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. వీరితో పాటు పలువురు ఎన్జీఓలు కూడా పాల్గొన్నారు. ముందుగా నమోదు చేసుకున్న వివరాల ప్రకారం తమ అభిప్రాయాలను సభలో తెలియజేశారు. మొత్తం 48 మంది తమ అభిప్రాయలను తెలుపగా అందులో కేవలం ఐదుగురు మాత్రమే ప్లాంట్‌ను వ్యతిరేకించారు. వీరితో పాటుగా లిఖితపూర్వంగా 22 మంది, ఈమెయిల్ ద్వారా 35 మంది అభిప్రాయాలను తెలిపారు.

ప్లాంట్‌కు అనుకూలమే.. కానీ సమస్యలు పరిష్కరించాలి : గ్రామస్తులు

ఈ ప్రాంతంలో ఇంత పెద్ద ప్లాంట్ ఏర్పాటు చేయడం మంచిదే. కానీ ఇక్కడ భూ నిర్వాసితులు, ల్యాండ్ లూజర్, ఎన్‌క్రోచర్ల సమస్యలు పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు కోరారు. యువతకు ఉద్యోగాలు కల్పించాలని, అధికంగా వాహనాలు ప్రయాణించే అవకాశం ఉండడం వల్ల దుమ్ము, ధూళితో అనారోగ్యాల పాలవుతారని, కర్మాగారం నుంచి కాలుష్యం రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లాంట్ చుట్టు పక్కల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, రహదారులు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణానది తీరంలో వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, కృష్ణా నది, అన్నవేరు వాగులు కలుషితం కాకుండా చూడాలని కోరారు.

కాలుష్యరహితంగా ప్లాంట్ నిర్మాణం : జెన్‌కో డైరెక్టర్

కాలుష్య రహితంగా అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి కాలుష్యం రాదని టీఎస్ జెన్‌కో డైరెక్టర్ అజయ్ తెలిపారు. పలువురు ఎన్జీఓలు అడిగిన అభ్యంతరాలపై ఆయన సమాధానం చెప్పారు. ప్లాంట్ నుంచి వచ్చే నీరు కృష్ణా, అన్నవేరు వాగులకు వదిలేదు లేదని, వేస్ట్ వాటర్‌ను ట్రీట్‌మెంట్ చేసి తిరిగి వాడుతామని తెలిపారు. ఈ ప్రాంతంలో ప్లాంట్ కోసం తీసుకున్న 1800 హెక్టార్ల అటవీ భూమిని దేవరకొండ వద్ద అటవీ శాఖకు అప్పగించామని, దీనితో పాటుగా 80 కోట్ల రూపాయలు చెల్లించామని అన్నారు. కొవిడ్ కారణంగా రెండు సార్లు లాక్‌డౌన్ విధించడంతో పదివేల మంది కార్మికులు రెండుసార్లు వారి ప్రాంతాలకు వెళ్లడంతో నిర్మాణం నిలిచిపోయిందని తెలిపారు. త్వరలో ప్లాంట్ పూర్తిచేసి విద్యుత్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెన్‌కో సీఎండీ రిజ్వీ, జిల్లా పర్యావరణ శాఖ అధికారి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కోణంలో చూడొద్దు : ఎమ్మెల్యే బీఎల్ఆర్

యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని రాజకీయ కోణంతో చూడవద్దని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యాదాద్రి పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. రాజకీయాలకతీతంగా సహకరించాలని, గ్రామాల అభివృద్ధికి ప్లాంట్ ఎంతో అవసరం పడుతుందని చెప్పారు. కాకపోతే ల్యాండ్ సేకరణలో, ల్యాండ్ లూజర్ల విషయంలో కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాంట్ ప్రారంభానికి ముందగానే నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చి వారికి శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్లాంట్ నుంచి దామరచర్ల వరకు నాలుగు లైన్ల రహదారి పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు.

ఆధునిక దేవాలయం యాదాద్రి పవర్ ప్లాంట్ : మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

కేసీఆర్ సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాంతంలో యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టారని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలోనైనా పరిశ్రమలు ఏర్పాటు అయితే లాభనష్టాలు ఉంటాయని, కానీ నష్టాన్నే బూచిగా చూపించి ప్లాంట్‌ను వ్యతిరేకించడం సరికాదని సూచించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ దేశానికే తలమానికంగా మారిందని, ప్రపంచ పటంలో ప్లాంట్ గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ ప్లాంట్ పూర్తయితే రాష్ట్రంలో విద్యుత్ కొరత తగ్గుతుందన్నారు. తొలుతగా ప్లాంట్ కోసం సేకరించిన భూమిలో అవసరం లేని 1,230 ఎకరాలు గిరిజనులకు అప్పగించాలని కోరారు.

ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన జనం